సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం


రుద్రకోటరాజుగూడెంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు


గుంటుపల్లిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- టి.నరసాపురం పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం

టి.నరసాపురం: సంక్షేమ పథకాల అమలుతో పాటు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నట్లు పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. మండలంలోని టి.నరసాపురం పంచాయతీ గండిగూడెం, ప్రకాష్‌నగర్, రుద్రకోటరాజుగూడెం, కాపుగూడెంలలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఇంటింటికి వెళ్లి గత నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు అందిన వివిధ రకాల లబ్ధి వివరాలను వివరించారు. ఆయా గ్రామాలలో ఉన్న సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. లో వోల్టేజ్, రహదారి సమస్య, డ్రెయినేజీల నిర్మాణ అవసరాలను స్థానికకులు వివరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తూ అన్ని వర్గాల ప్రజల మన్ననలతో ముందుకు సాగుతుందన్నారు. తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. నాడు–నేడు పథకాల అమలుతో పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేట్ స్థాయి విద్యను గ్రామాల్లోనే అందిస్తున్నారని వివరించారు. సచివాలయాల వ్యవస్థ ద్వారా అన్ని రకాల సేవలను గ్రామాల్లోని అందుబాటులో ఉంచారన్నారు. ప్రజలు అధికారుల చుట్టూ తిరగకుండా అధికారులే ప్రజలు చుట్టూ తిరిగేలా చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు.

పుట్రేపు రహదారి అభివృద్ధి

టి.నరసాపురం – మక్కినవారిగూడెం రహదారి నుంచి బండివారిగూడెం వరకు ఉన్న 3.9 కిలోమీటర్ల రహదారిని బీటీ రహదారిగా అభివృద్ధి చేస్తున్నట్లు పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. ఈ రహదారి అభివృద్ధికి ఇప్పటికే నిధులు మంజూరై టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందన్నారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభిస్తారని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సామంతపూడి బాలసూర్యనారాయణరాజు, ఎంపీపీ దారుబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీను రాజు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, దేవరపల్లి ముత్తయ్య, దేవరపల్లి సీతారాం ప్రసాద్, కటకం మల్లికార్జునరావు, తడికలపూడి కిషోర్‌కుమార్, కన్నం సర్వేశ్వరరావు, నల్లూరి శ్రీనివాస్, నోముల సత్యనారాయణ, దాకారపు సూరిబాబు, చందనాల శ్రీను, బోళ్ళ రంగారావు, సర్పంచ్ మోదుగు సునంద, ఎంపీటీసీలు నార్లపాటి వెంకట్రావు, అర్జా బాలయ్య పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే జగనన్న లక్ష్యం

కామవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మంగళవారం గుంటుపల్లి గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ బుక్‌లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో పరిపాలన చేపట్టిన వెంటనే లక్షలాదిమంది యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించి, ఇంటికే సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. పేద విద్యార్థులు సైతం ఉన్నత విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్య వంటి పథకాలను అందించి, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్ది ఇంగ్లీష్ మీడియంను అందిస్తున్నారన్నారు. పేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో దేశ చరిత్రలోనే రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మహిళలకు సున్నా వడ్డీ, ఆసరా, స్త్రీనిధి అనేక పథకాలు ద్వారా జీవనోపధి కల్పించి ఆదుకున్నారన్నారు. దీనితో రాష్ట్ర ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తూ మరలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన వైపే చూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్‌బాబు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, నాయకులు నాగళ్ళ సీతారాంబాబు, కొమ్మి నరేష్, తుమ్మల సీతారామయ్య, టాకూరి ఆశీర్వాదం, తోటా దావీదు, చింతలపూడి ఏఎంసీ డైరెక్టర్ కొప్పాక రామకృష్ణ, షేక్ మీరాసాహెబ్, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రజలకు ఎనలేని మేలు


చింతలపూడి: తిమ్మిరెడ్డిపల్లిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం


జంగారెడ్డిగూడెం రూరల్: కేతవరంలో బుక్‌లెట్ అందజేస్తున్న నాయకులు

చింతలపూడి: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని తిమ్మిరెడ్డిపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు మాట్లాడుతూ గత టీడీపీ పాలనతో పోల్చుకుంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన నాలుగున్నర ఏళ్లలో ప్రజలకు కనివినీ ఎరుగని రీతిలో మేలు జరిగిందని అన్నారు. సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు వివిధ పథకాల ద్వారా కోట్ల రూపాయల నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. సభలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ విక్టర్‌బాబు, సచివాలయ కన్వీనర్లు వీధి రాజేష్, రామిశెట్టి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ విద్యాసాగర్, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేతవరంలో వై ఏపీ నీడ్స్ జగన్

జంగారెడ్డిగూడెం రూరల్: కేతవరం గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలంటే.. కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రజల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలు వివరించారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, వైస్ ఎంపీపీ బుజ్జిబాబు, పార్టీ నాయకులు గురజాల పార్థసారథి పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

చింతలపూడి: చింతంపల్లి గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపీపీ డా.రాంబాబు నాయక్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు చేరవేయడంలో శ్రద్ధ వహించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు సక్రమంగా అందించాలన్నారు.

దాతలు సహకరించాలి

ఉంగుటూరు: నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రణాళిక, అభివృద్ధి నూతన కమిటీ మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ కళాశాలను అభివృద్ధి చేయాలని, న్యాక్ అక్రిడేషన్‌లో భాగంగా కళాశాలలో కావాల్సిన మౌలిక వసతులను సమకూర్చడానికి దాతలు ముందుకు రావాలని కోరారు అనంతరం ఎమ్మెల్యే సలహా మేరకు దాతలు ముందుకు వచ్చి కళాశాల అభివృద్ధికి విరాళాలు ప్రకటించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టీకే విశ్వేశ్వరరావు ప్రణాళిక, అభివృద్ధి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

15 నుంచి సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణోత్సవాలు


ద్వారకాతిరుమల క్షేత్రంలో సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయాన్ని విద్యుద్దీప తోరణాలతో ముస్తాబు చేస్తున్న సిబ్బంది


ఆలయంలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో ఈనెల 15 నుంచి 21 వరకు స్వామివారి కల్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథ రావు తెలిపారు. ఈ క్రమంలో దేవాలయాన్ని, పరిసరాలను రంగులు, విద్యుద్దీప తోరణాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా 15న ఉదయం స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేస్తారు. 16, 17 తేదీల్లో విశేష పూజలు, 18న రాత్రి 7 గంటల నుంచి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగనుంది. అలాగే 19న స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, నిత్యోపాసన, రాత్రి నెమలి వాహనంపై గ్రామోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహిస్తారు. 21న స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, ద్వాదశి ప్రదక్షిణలు, శ్రీ పుష్పయాగోత్సవ వేడుకలతో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయి. కావున పెద్ద ఎత్తున భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఈఓ కోరారు.

కార్తీక పూజలు

జంగారెడ్డిగూడెం: కార్తీక మాసం ముగింపు సందర్భంగా మంగళవారం దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీకమాసోత్సవాల్లో భాగంగా విజయదుర్గ అమ్మవారి ఆలయంలో లక్షదీపోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలను వెలిగించారు. తొలుత శివయ్యకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శివలింగాన్ని దీపాలతో విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో శివలింగాకారంలో దీపాలు వెలిగించారు. పట్టణంలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతుల పర్యవేక్షణలో అర్చకులు మిర్తిపాటి విశ్వనాథ శ్రీనివాస్ గణపతిపూజ నిర్వహించి అనంతరం భక్తులచే సహస్ర దీపాలకంరణ కార్యక్రమం నిర్వహించారు. అలాగే నూకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ఈశాన్య భారత్ శ్రీ బాలా త్రిపురసుందరి పీఠాధిపతులు శ్రీ కపిలేశ్వరానందగిరి స్వామీజి దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు మనోజ్ శర్మ శ్రీ నర్మదా అమృత బాణ లింగేశ్వర స్వామి వారికి ఏకలింగితోభద్ర మండల యంత్ర పూర్వక విశేష అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఇందిరా నగర్ కాలనీలో కొలువై ఉన్న శ్రీ అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జై హనుమాన్ నామస్మరణతో కోలాట నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

కొయ్యలగూడెం: బయ్యనగూడెంలోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, ఎస్సై జీజే విష్ణువర్ధన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కొత్తలంక శివ సత్యనారాయణ చార్యుల ఆధ్వర్యంలో భక్తులు సామూహిక పూజలు చేశారు. అనంతరం ధర్మకర్త బాలం దత్తుడు ఆధ్వర్యంలో రెండువేల మందికి పైగా భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. కన్నాపురంలోని పులిరామన్నగూడెం రోడ్డులో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద ధర్మకర్త గడి గోవిందు ఆధ్వర్యంలో, వెంకయ్యపాలెం రోడ్డులోని కంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంఘం వద్ద అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు.


విజయదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో దీపాల కాంతులలో ఈశ్వరుని దర్శనం


నూకాలమ్మ ఆలయంలో కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం


అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో కోలాటం నిర్వహిస్తున్న మహిళలు


బయ్యనగూడెం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

దెబ్బతిన్న పంటల పరిశీలన


మాతన్నగూడెంలో పంటలను పరిశీలించిన శ్రీనివాస్

జంగారెడ్డిగూడెం రూరల్: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి ఎర్రకాలువ జలాశయం నీరు ఎగదన్ని పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. జంగారెడ్డిగూడెం మండలంలోని తాడువాయి, మాతన్నగూడెం, గొల్లగూడెం, మంగిశెట్టిగూడెం గ్రామాలలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పర్యటించి తుపానుకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తాడువాయి శివారు మాతన్నగూడెంలో ఎర్రకాలువ జలాశయం భూసేకరణలో లేని దాదాపు 150 ఎకరాలు పేద రైతుల పట్టా భూములలో సాగుచేసిన పొగాకు, చెరకు, ఆయిల్ పామ్, కోకో, కూరగాయలు తదితర పంటలు జలాశయం నీరు ఎగదన్ని ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, ఆయిల్ పామ్ రైతుల సంఘం నాయకులు అనపర్తి వెంకటేశ్వరరావు, బాధిత రైతులు పరిమి బుల్లబ్బులు, పల్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వేబ్రిడ్జిల తూకాల్లో తేడాలు


రాఘవాపురం వేబ్రిడ్జి వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: మండలంలోని ఎలక్ట్రానిక్ వేబ్రిడ్జిలను తూనికలు కొలతల అధికారులు తనిఖీలు నిర్వహించారు. పోతునూరు గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి అనే రైతు ఇటీవల తాను పండించిన ధాన్యాన్ని మండలంలోని ఒక రైస్‌మిల్లుకు తీసుకు వెళ్లి కాటా వేయగా ధాన్యం బరువులో తేడా రావడంతో రాఘవాపురం సాయిరాం వేబ్రిడ్జిలో మళ్లీ తూకం వేయించారు. 9 టన్నుల తూకం వేస్తే 1,300 కేజీలు తేడా రావడంతో తూనికలు, కొలతలు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఈశ్వర్‌రామ్ తన సిబ్బందితో గత రెండు రోజులుగా తనిఖీలు నిర్వహించగా తూకాల్లో తేడా ఉన్నట్లు గుర్తించి సదరు వేబ్రిడ్జిని సీజ్ చేసినట్లు మంగళవారం తెలిపారు. రైతులు ధాన్యం తూకాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, వే బ్రిడ్జిల్లో తూకాలు వేసినప్పుడు తప్పనిసరిగా రిసిప్ట్ తీసుకుని దగ్గర ఉంచుకోవాలని సూచించారు.

తపాలా ఉద్యోగుల సమ్మె


జంగారెడ్డిగూడెం హెడ్‌పోస్టాఫీసు వద్ద సమ్మె చేస్తున్న తపాలా ఉద్యోగులు

జంగారెడ్డిగూడెం: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని తపాలా శాఖ ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగులు పిలుపు మేరకు జంగారెడ్డిగూడెం హెడ్‌పోస్టాఫీసు పరిధిలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 150 మంది తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. హెడ్‌పోస్టాఫీస్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ గ్రామీణ తపాల ఉద్యోగులకు స్టేటస్ కల్పించాలని, గ్రామీణ ఉద్యోగుల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గ్రాట్యుటీని రూ.1.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ ఐదు లక్షలు ఇవ్వాలని, 180 రోజులు సెలవులు ఇచ్చి దాన్ని కాష్‌గా మార్చుకునే అవకాశం కల్పించాలని కోరారు. అలాగే సీనియర్ ఇంక్రిమెంటు 12, 24, 36 వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏలూరు డివిజన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, సెక్రెటరీ బాజీ, వైస్ ప్రెసిడెంట్ వి.డేవిడ్ రాజు, అసిస్టెంట్ సెక్రటరీ దుర్గారావు, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

పోలవరం రూరల్: వింజరం గ్రామ పంచాయతీ సచివాలయం వద్ద వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సంబంధిత శాఖాధికారులు ప్రజలకు వివరించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఒక పక్క నిరుపేదలకు సంక్షేమ పథకాలు అమలుచేస్తూనే, మరో పక్క అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకం, ఉచిత రేషన్ బియ్యం వంటి పథకాలు అమలుచేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, ఎంపీడీవో జి.శ్రీను, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, సర్పంచ్ కొక్కెర వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనసమారాధన సందడి


గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును సత్కరిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: స్థానిక హర్షవనంలో మంగళవారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. ద్వారకాతిరుమల ఆర్యవైశ్య ప్రముఖులు యిమ్మడి వారు ఏర్పాటు చేసిన ఈ వన భోజనాల్లో అన్ని వర్గాలకు చెందిన వారు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముందుగా మహిళలు ఉసిరి చెట్టు వద్ద దామోదర పూజ నిర్వహించారు. అనంతరం కార్తీక వనసమారాధన ప్రారంభించారు. ఇందులో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును ఆర్యవైశ్యులు ఘనంగా సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పిల్లలు, పెద్దలు, మహిళలు, యువతులు అంతా కలసి ఆటపాటలతో సరదాగా గడిపారు.

మానసిక వికలాంగులకు కిట్ల పంపిణీ


కిట్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ బృందం

కొయ్యలగూడెం: పరింపూడిలోని దివ్యాంగుల స్కూలులో మానసిక వికలాంగులకు రోటరీ క్లబ్ మంగళవారం కిట్లు పంపిణీ చేసింది. క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ చోడిపిండి సుబ్రహ్మణ్యం సౌజన్యంతో వీటిని సమకూర్చినట్లు క్లబ్ అధ్యక్షుడు విశ్వనాథ శర్మ తెలిపారు. మానసిక వికలాంగులలో ఆత్మస్థైర్యం నింపడంతో పాటు వారు ఆటలలో ప్రావీణ్యం సాధించేలా అందజేసినటువంటి కిట్లు ఉపయోగపడతాయని తెలిపారు. సిరివెళ్ల సుబ్రహ్మణ్యం, తోట వెంకటేశ్వరరావు, బోనగిరి పాపారావు, ఎస్‌బీజీ శేఖర్, క్లబ్ కార్యదర్శి గోలిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అరటి దొప్పల వితరణ


జంగారెడ్డిగూడెంలో అరటి దొప్పల వితరణ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: హరిహరులకు అత్యంత ప్రీతికరమైన కార్తీకమాసంలో చివరి రోజు పోలిని స్వర్గానికి పంపే క్రతువులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు చిలుకూరి సాయి బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలు, భక్తులు దీపాలు నదిలో వదులుతారన్నారు. ఇందుకు వినియోగించే అరటి దొప్పలను మంగళవారం జంగారెడ్డిగూడెం ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో వితరణ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. స్థానిక హైస్కూల్ పక్కన శివాలయం వద్ద కార్యదర్శి కూచిబొట్ల రాము పర్యవేక్షణలో అరటి దొప్పలను పంపిణీ చేసినట్లు చెప్పారు.

ఓటు వజ్రాయుధంతో సమానం


విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్

కొయ్యలగూడెం: ఓటు హక్కు వజ్రాయుధంతో సమానం అని 18 సంవత్సరాల నిండిన యువత అందరూ ఓటు హక్కు కలిగి ఉండాలి అని తహసీల్దార్ పాసం నాగమణి పేర్కొన్నారు. మంగళవారం కొయ్యలగూడెంలో విద్యార్థులతో కలసి ఓటు హక్కు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన విద్యార్థులతోపాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని జాతీయ ప్రధాన రహదారిపై ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ మణి దివ్య, వీఆర్‌వో అడపా రామ్మోహన్‌రావు, కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ సేవలు ఆదర్శనీయం


సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్సై జయబాబు

కామవరపుకోట: సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ సేవలు ఆదర్శనీయం అని తడికలపూడి ఎస్సై జయబాబు అన్నారు. మంగళవారం స్థానిక మసీదు వద్ద వలస వచ్చి ఉంటున్న గంగిరెద్దుల వారికి సహాయ పౌండేషన్ ఆధ్వర్యంలో రెబ్బా సత్యనారాయణ కుమారులు చందు, అశోక్‌ల ద్రవ్య సహాయంతో దుప్పట్లు పంపిణీ చేశారు. ఎస్సై జయబాబు చేతులమీదుగా గంగిరెద్దుల వారికి దుప్పట్లు అందజేశారు. సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు తమ్మిశెట్టి సత్యనారాయణ, టీవీఎస్ రాజు, వీరమల్ల మధు, మున్నంగి శ్రీనివాస్, పండూరి రామసాయి, రెబ్బా సత్యనారాయణ పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్ నూతులపాటి శ్రీనుకు మాతృ వియోగం


నాగరత్నం భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

లింగపాలెం: ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, సచివాలయ కన్వీనర్ నూతలపాటి శ్రీనివాసరావు తల్లి నాగరత్నం (74) మృతి చెందారు. మంగళవారం ఆమె భౌతిక కాయాన్ని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, వైఎస్సార్ సీపీ నేతలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాసరావును ఎమ్మెల్యేతోపాటు పలువురు నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, పార్టీ ముఖ్య నేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు కొఠారి మోహన్ తదితరులు శ్రీనును పరామర్శించారు.

అంగన్‌వాడీల సమ్మె

బుట్టాయగూడెం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుట్టాయగూడెం, టి.నరసాపురం తహసీల్దార్ కార్యాలయాల వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాల నాయకులు మంగళవారం ఆందోళనలు నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేవరకు సమ్మె కొనసాగిస్తామని అంగన్‌వాడీలు పేర్కొన్నారు.

చింతలపూడి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం సమ్మెకు దిగారు. స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్ వద్ద ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ ఫెడరేషన్, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో ఆందోళన శిబిరం నిర్వహించారు.